# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

ఆదివారం 21, డిసెంబర్ 2025


## రహదారి భద్రత మాసోత్సవాలను

# విజయవంతం చేయాలి

★ రాష్ట్ర రోడ్డు రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్




నస్పూర్, డిసెంబర్ 20, ప్రభాతవార్త

రహదారి భద్రత మాసోత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర రోడ్డు రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, రవాణా శాఖ, రోడ్లు భవనాల ప్రత్యేక కార్యదర్శి వికాస్ రాజ్, అదనపు డిజిపి మహేష్ భగవత్‌లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు



ఉన్నతాధికారులు, అదనపు కలెక్టర్లు, ఇతర శాఖల అధికారులతో రోడ్డు భద్రతా మాసోత్సవాల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో రహదారి భద్రత మాసోత్సవాలు 2026లను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. గత సంవత్సరం నుంచి రహదారి వారోత్సవాలను, రహదారి మాసోత్సవాలను నిర్వహించడం జరుగుతుందని, జనవరి మాసంలో రహదారుల నియమాలు, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర అంశాలపై నెల రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆర్‌టిసి, రవాణా శాఖ, విద్యాశాఖ, పోలీస్ శాఖ, జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీల ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. అధికారులు రహదారి భద్రతను సామాజిక బాధ్యతగా భావించి కార్యక్రమంలో పాల్గొనాలని, రోడ్డు ప్రమాదాల వల్ల కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయని, ప్రతి ఒక్కరికి రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించడంతో పాటు ట్రాఫిక్ ఉల్లంఘనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై ముగ్గుల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వ్యాసరచన క్విజ్ పోటీలు నిర్వహించడం ద్వారా అవగాహన కల్పించాలని, రోడ్ సేఫ్టీ వాలంటీర్లను నియమించి వారి ద్వారా ప్రజలకు రహదారి భద్రత నియమాలు

మిగతా 2లో..

# మంచిర్యాలలో నెక్స్ ఐరా ఐటీ స్టార్టప్

✳ జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ చేతుల మీదుగా గోడప్రతుల ఆవిష్కరణ

నస్పూర్, డిసెంబర్ 20, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లా కేంద్రంలో త్వరలో ప్రారంభం కానున్న నెక్స్ ఐరా ఐటీ కంపెనీ, సాఫ్ట్‌వేర్ శిక్షణ కేంద్రం (స్టార్టప్) గోడప్రతులను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. శుక్రవారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమంలో కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ మోతే శరత్ చంద్ర, రాష్ట్రపతి అవార్డు గ్రహీత, సైకాలజిస్ట్ గుండేటి యోగేశ్వర్ పాల్గొన్నారు.




ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. మంచిర్యాలలో తొలిసారిగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డాటా సైన్సెస్, ఎంబెడెడ్ సిస్టమ్స్, డెవాప్స్ వంటి అత్యాధునిక సాంకేతిక అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న సాఫ్ట్‌వేర్ స్కిల్ డెవలప్‌మెంట్ సదుపాయాలను కూడా ఇక్కడ కల్పిస్తున్నట్లు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్‌కు పచ్చని మొక్కను అందించి, త్వరలో జరగనున్న ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ఆహ్వానించగా ఆయన సానుకూలంగా స్పందించారు.



# ఎస్ఓ మేడం మాకు వద్దంటే వద్దు...

✶ కలెక్టర్ రావాలి మాకు న్యాయం చేయాలి ✶ ఎస్ఓ మేడంను తొలగించాలని విద్యార్థుల ఆందోళన

✶ వాంకిడి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో తీవ్ర ఉద్రిక్తత

వాంకిడి, డిసెంబర్ 20, ప్రభాతవార్త :

వాంకిడి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఎస్ఓ తమకు తీవ్ర అనుచిత వ్యాఖ్యలతో మానసిక వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తూ విద్యార్థులు శనివారం తరగతులను బహిష్కరించి రోడ్డెక్కారు. తల్లిదండ్రులతో కలిసి పూకుమ్మడిగా వచ్చి తహసిల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా చేపట్టారు. విశ్వ మేడం మాకు వద్దంటే వద్దు కలెక్టర్ రావాలి మాకు న్యాయం చేయాలి అంటూ విద్యార్థులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఎస్ఓ గత కొంతకాలంగా తనను తమ తల్లిదండ్రులను అకారణంగా తీవ్ర పదజాలంతో దూషిస్తుందని కోడిగుడ్లు సైతం ఇవ్వడం లేదని విద్యార్థులు ఆరోపించారు. మేడం టార్చర్ వల్ల పాఠశాలలో చదవలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమెపై తగు చర్యలు తీసుకోవాలని పిల్లల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై అక్కడికి చేరుకుని విద్యార్థులతో మాట్లాడి నచ్చచెప్పే ప్రయత్నం చేసినా వినలేదు. కలెక్టర్ వచ్చి తమకు న్యాయం చేసే వరకు ఆందోళన కొనసాగిస్తామని చెప్పారు.

## అధికారుల ఏకపక్ష నిర్ణయాలతో

# సింగరేణి ప్రతిష్టకు భంగం!

✪ రిటైర్డ్ కార్మికులకు బోనస్ నిలిపివేయడం దుర్మార్గం

✪ ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య



నస్పూర్, డిసెంబర్ 20, ప్రభాతవార్త

సింగరేణి సంస్థలో కొంతమంది అధికారులు నిరంకుశంగా వ్యవహరిస్తూ సంస్థ కీర్తిప్రతిష్టలను దెబ్బతీస్తున్నారని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య మండిపడ్డారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, కార్మికుల పట్ల యాజమాన్యం అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను తీవ్రంగా ఖండించారు. పదవీ విరమణ చేసిన కార్మికులకు మిగతా 2లో..

### రహదారి భద్రత మాసోత్సవాలను

# విజయవంతం చేయాలి

**(మొదటిపేజీ తరువాయి)**

తెలిసేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రతి నెల రహదారి భద్రత కమిటీల ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించాలని, అవాంచిత రోడ్డు ప్రమాదాలు నివారించేలా కృషి చేయాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో రహదారుల నిర్మాణాలు, ఇన్ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు. అధిక వేగం, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, డ్రంక్ అండ్ డ్రైవ్ తదితర కారణాల వల్ల రహదారి ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని, ప్రమాదాలు నివారించడానికి ప్రతి ఒక్కరూ రహదారి భద్రత సూచనలను పాటించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ రహదారి భద్రత కొరకు, రహదారి భద్రత కమిటీ ఆధ్వర్యంలో ప్రతి నెల సమావేశం నిర్వహించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ప్రమాద ప్రాంతాలను గుర్తించి వాహనదారులకు తెలిసే విధంగా ప్రమాద సూచికలు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన ప్రాంతాలలో వేగనిరోధకాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా భద్రతా నియమాలు పాటించని వారి లైసెన్సులు రద్దు చేయడం జరుగుతుందని, కొత్త సంవత్సర వేడుకలు దృష్ట్యా డిసెంబర్ 31 రోజున స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

### అధికారుల ఏకపక్ష నిర్ణయాలతో

# సింగరేణి ప్రతిష్టకు భంగం!

**(మొదటిపేజీ తరువాయి)**


లాభాల వాటా, దీపావళి బోనస్ (పీఎల్ఆర్) చెల్లించడానికి క్వార్టర్ ఖాళీ చేయాలనే నిబంధన పెట్టడం గతంలో ఎన్నడూ లేదని ఆయన గుర్తుచేశారు. గతంలో క్వార్టర్ ఖాళీ చేయని పక్షంలో కేవలం గ్రాట్యూటీ మాత్రమే నిలిపివేసేవారని, ఇప్పుడు బోనస్‌లను కూడా ఆపడం విడ్డూరంగా ఉందన్నారు. అధికారుల ఈ కొత్త నిబంధనలు రిటైర్డ్ కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సంస్థల నుండి సింగరేణికి రావాల్సిన 40 వేల కోట్ల రూపాయలకు పైగా బకాయిలను రాబట్టడంలో అధికారులు పూర్తిగా వైఫల్యం చెందారని సీతారామయ్య విమర్శించారు. ఒకవైపు సంస్థకు రావాల్సిన నిధులపై నిరక్ష్యం వహిస్తూనే, మరోవైపు సింగరేణి కార్యకలాపాలు లేని జిల్లాల్లో కోట్లాది రూపాయలు ఖర్చు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వానికి సింగరేణి నిధులు ధారాళంగా ఇస్తున్నప్పుడు, కార్మికుల హక్కుల విషయంలో ఎందుకు వెనుకాడుతున్నారని నిలదీశారు.

### అవతరణ వేడుకలపై వివక్ష..

సింగరేణి అవతరణ దినోత్సవం అనేది కార్మికులు, వారి కుటుంబ సభ్యులు జరుపుకునే గొప్ప పండుగని, అయితే ఈ ఏడాది నిధులు లేవనే సాకుతో వేడుకలను కేవలం జనరల్ మేనేజర్ కార్యాలయాలకే పరిమితం చేయడం అన్యాయమన్నారు. బడ్జెట్ తగ్గించి కార్మికులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని, సంస్థ భవిష్యత్తును నిర్వీర్యం చేయడానికి పూనుకున్న అధికారులు భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్మిక వ్యతిరేక విధానాలను ఏఐటీయూసీ తరపున తీవ్రంగా ప్రతిఘటిస్తామని సీతారామయ్య స్పష్టం చేశారు.

# యూరియా బుకింగ్‌పై అవగాహన సదస్సు

**సారంగాపూర్, డిసెంబర్ 20,ప్రభాతవార్త:**




వ్యవసాయ శాఖ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో అగ్రికల్చర్ డైరెక్టర్ డాక్టర్ బి గోపి యూరియా వినియోగం, యూరియాని ఇంటి దగ్గర నుండే ఏ విధంగా బుక్ చేసుకొని పొందాలని వివరాలు తెలిపారు. ఈ సందర్భంగా అగ్రికల్చర్ డైరెక్టర్ మాట్లాడూతు రైతులు అధికమైన యూరియా వాడి భూసారాన్ని తగ్గిస్తున్నారని తెలంగాణ ప్రభుత్వం గ్రహించిందన్నారు. రైతులు యూరియా కోసం ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ఇంటికికె యూరియా అందేలా తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ ఫర్టిలైజర్ ఆప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ఈ ఆప్‌ని రైతులు డౌన్లోడ్ చేసుకొని ఓపెన్ చేసి అందులో మొబైల్ నెంబర్ యాడ్ చేసిన వెంటనే ఓటీపీ రావడం జరుగుతుంది. దానిని ఎంట్రీ చేసి రైతు పట్టా పాస్ బుక్ నెంబర్ రైతు వివరాలు నమోదు చేయాలి ఆ విధంగా చేయగానే ఎన్ని ఎకరాలు ఏపంట వేయడం జరిగింది అని వివరాలు నమోదు చేస్తే బుకింగ్ నంబర్ వస్తుంది. వెంటనే సంబంధిత డీలర్ పేరును నమోదు చేసి యూరియా తీసుకోవాలని తెలిపారు. వేరే రైతులు, కౌలురైతులు కూడా నమోదు చేసుకోవచ్చని అన్నారు. 24 గంటల లోపు యూరియా బస్తలు తీసుకొని ఎడల మీకు కేటాయించిన బుకింగ్ రద్దు అవుతుందని, యూరియా బస్తలు మీకే ఉంటాయని తెలిపారు. రైతులకు ఎలాంటి సమస్యలు ఉన్న దీని గురించి వ్యవసాయ అధికారులను సంప్రదించి పంటలలో ఎరువులను ఏ విధంగా ఉపయోగించాలో తెలుసుకోవాలని అన్నారు. ప్రస్తుతం మనకు పదిలక్షల మెట్టు టన్నుల యూరియా అవసరం ఉంది మనకు ఇప్పుడు అందుబాటులో 4.5 లక్షల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంది అని తెలిపినారు. ఈ యాప్ లోని యూరియా స్టాక్ ఎంతుంది అనే వివరాలు కూడా రైతులు నేరుగా తెలుసుకోవచ్చు అని తెలిపినారు. ఏదైనా సమస్య ఉంటే దగ్గరలో ఉన్న వ్యవసాయాధికారిని కలిసి తెలుసుకోగలరని తెలిపినారు.

# విజయమే ఇంటిపేరుగా మార్చుకున్న విజయ్..

- ముచ్చటగా మూడోసారి వ్యాపార సంఘ అధ్యక్షుడుగా ఎన్నిక
- తోటి వ్యాపారస్తులకు కృతజ్ఞతలు తెలిపిన విజయ్

**మందమర్రి, డిసెంబర్ 20, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణ మార్కెట్ వ్యాపార సంఘ అధ్యక్ష ఎన్నికల్లో తమ్మిశెట్టి విజయ్ ఘన విజయం సాధించారు. శనివారం నిర్వహించిన ఈ ఎన్నికల్లో మొత్తం 512 మంది వ్యాపార సభ్యులు ఉండగా, 482 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సంఘ ఎన్నికల్లో



511 ఓట్లకు గాను 482 పోలయ్యాయి. ఇందులో మాయ రమేష్ కు 169 ఓట్లు రాగా తమ్మిశెట్టి విజయ్ కి 300 ఓట్లు నమోదు అయ్యాయి 13 ఓట్లు చెల్లనివిగా పరిగణించబడ్డాయి. ఈ ఎన్నికల్లో తన ప్రత్యర్థి మాయ రమేష్ పై 131 భారీ ఓట్ల మెజారిటీతో తమ్మిశెట్టి విజయ్ విజయం సాధించి, ముచ్చటగా మూడోసారి వ్యాపార సంఘ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. వ్యాపారస్తుల సంపూర్ణ మద్దతుతో గెలుపొందిన విజయ్, తనను విశ్వసించి అధిక మెజారిటీతో గెలిపించిన తోటి వ్యాపారస్తులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల ప్రక్రియను శాంతియుతంగా, పారదర్శకంగా నిర్వహించిన ఎన్నికల కమిటీ (ఈసీ) సభ్యులకు వ్యాపార సంఘం తరఫున అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమర్థవంతంగా ఎన్నికలు నిర్వహించినందుకు ఈసీ సభ్యుల సేవలను ప్రశంసించారు.

# ఉత్తమ రీజియన్ చైర్ పర్సన్‌గా కేశెట్టి వంశీకృష్ణ

**మంచిర్యాల, డిసెంబర్ 20, ప్రభాతవార్త**




అంతర్జాతీయ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో 2025 సంవత్సరంలో డిస్టిక్ వి 107 ఏ పరిధిలో చేపట్టిన సేవా కార్యక్రమాలకు రీసెంట్ చైర్ పర్సన్ కేశెట్టి వంశీకృష్ణకు ఉత్తమ చైర్ పర్సన్‌గా అవార్డు దక్కింది. హైదరాబాదులోని క్లాసిక్ 3 కన్వెన్షన్ హాల్ లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ సంవత్సరం వివిధ విభాగాల్లో నిర్వహించిన సేవా కార్యక్రమాలకు ఉత్తమ రీజియన్ చైర్ పర్సన్‌గా ఆయన ఎంపిక చేశారు. మంచిర్యాల, ఆసిఫాబాద్ రెండు జిల్లాలలోని 15 వాసవి క్లబ్‌లకు రీజియన్ చైర్ పర్సన్‌గా క్లబ్ ఉన్నతికి, సభ్యత్వ నమోదు పెంపుకు, పలువురు చిరు వ్యాపారులకు వడ్డీ లేని రుణాలు అందజేయడం, నిరుపేద విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ స్కాలర్షిప్ పంపిణీ కార్యక్రమాలు చేపట్టడం దాదాపు 15 లక్షల రూపాయల సేవా కార్యక్రమాలను ఈ రెండు జిల్లాలలో వాసవి క్లబ్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ రీజియన్ చైర్ పర్సన్‌గా ఎన్నికైన వంశీకృష్ణను జిల్లా గవర్నర్ ఇల్లందుల కిషోర్, అంతర్జాతీయ అధికారులు ముక్త శ్రీనివాస్, రేణిగుంట్ల శ్రీనివాస్, సిరిపురం రాజేష్, కటకం హరీష్, కొండ చంద్రశేఖర్, బాల సంతోష్, పుల్లూరి బాలు మోహన్, తోటి జర్నలిస్టు మిత్ర బృందం, ఓం అష్టోత్తర యోగా పీట్ సభ్యులు, తదితరులు అభినందించారు.

## డాక్టర్స్ సెల్ జిల్లా కోఆర్డినేటర్‌గా కొత్తపల్లి రాజ్ కుమార్ నియామకం

బెల్లంపల్లి, డిసెంబర్ 20, ప్రభాతవార్త



తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలోని డాక్టర్స్ సెల్ – మెడికల్ అండ్ హెల్త్ విభాగంలో మంచిర్యాల జిల్లా కోఆర్డినేటర్‌గా కొత్తపల్లి రాజ్‌కుమార్‌ను నియమిస్తూ నియామక ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు టీపీసీసీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ ఎం.రాజీవ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పార్టీని బలోపేతం చేయడంలో భాగంగా టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బి. మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో కృషి చేయాలని, ప్రజారోగ్య రంగం బలోపేతానికి తన వంతు సహకారం అందించాలని డాక్టర్ రాజీవ్ ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొత్తపల్లి రాజ్‌కుమార్ మాట్లాడుతూ తనపై ఈ బాధ్యతను అప్పగించిన టీపీసీసీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ ఎం.రాజీవ్ కు కృతజ్ఞతలు తెలిపారు. టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బి.మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో పార్టీని గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు బలోపేతం చేసేందుకు నిరంతరం కృషి చేస్తానన్నారని అన్నారు. అలాగే ప్రజారోగ్య పరిరక్షణ, వైద్య సేవల విస్తరణలో డాక్టర్స్ సెల్ కీలక పాత్ర పోషించేలా ముందుకు సాగుతామని ఆయన పేర్కొన్నారు.



## శ్రీరాంపూర్ ఏరియాలో 338 మందికి పదోన్నతులు

### - జనవరి 1న ఉత్తర్వుల పంపిణీ
### - గడువులోగా ప్రక్రియ పూర్తి చేసిన సిబ్బందికి జీఎం అభినందనలు

నస్పూర్, డిసెంబర్ 20, ప్రభాతవార్త

శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేస్తున్న 338 మంది ఉద్యోగులకు సర్వీసు లింక్డ్ పదోన్నతుల ప్రక్రియను నిర్ణీత సమయంలో పూర్తి చేసినట్లు ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ తెలిపారు. ఈ పదోన్నతులకు సంబంధించిన ఉత్తర్వుల కాపీలను 2026 జనవరి 1వ తేదీన ఆయా గనుల విభాగాల్లో కార్మికులకు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రక్రియను గడువు కంటే ముందే పూర్తి చేయడంలో కీలక పాత్ర పోషించిన పర్సనల్ విభాగం ఉద్యోగి కె. శ్రీధర్‌ను శనివారం జీఎం ప్రత్యేకంగా అభినందించి బహుమతిని అందజేశారు. పారదర్శకంగా, వేగంగా పని పూర్తి చేసిన సిబ్బందిని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. కార్యక్రమంలో డీజీఎం (పర్సనల్) ఎస్. అనిల్ కుమార్, డివై పీఎం ఎం. రాజేష్, సీనియర్ పీవోలు ఎస్. సురేందర్, మురళీ, పర్సనల్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## మిగిలిన పంచాయతీలలో ఉపసర్పంచ్‌ల ఎన్నిక

జైపూర్, డిసెంబర్ 20, ప్రభాతవార్త

జైపూర్ మండలంలో పెండింగ్‌లో ఉన్న మూడు గ్రామ పంచాయతీలలో శనివారం ఉప సర్పంచ్‌లను ఎన్నుకున్నారు. టేకుమట్ల గ్రామ పంచాయతీలో గొనె ప్రవీణ్‌ను వార్డ్ సభ్యులు ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. మిట్టపల్లి గ్రామ పంచాయతీలో ఆరుగురు వార్డు మెంబర్ సభ్యులు కుమ్మరి రాకేష్ ఉపసర్పంచ్‌గా, వేలాల గ్రామ పంచాయతీలో ఆరుగురు వార్డు మెంబర్లు సుందిల్ల రాజలింగును ఉపసర్పంచ్‌గా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్వోలు రాజన్న, శ్యామసుందర్, రాజేందర్, ఎంపిడివో జి.సత్యనారాయణ, ఎంపిఓ శ్రీపతి బాపు రావు, జైపూర్ ఎస్సై శ్రీధర్, సర్పంచ్లు మనోహర్, వెంకటేష్, పంచాయతీ కార్యదర్శులు ఆర్.శ్రావణి, రాకేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



# శ్రీలత హాస్పిటల్ లైసెన్స్ రద్దు చేయాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

### - డీఎం అండ్ హెచ్‌ఓకు విన్నపం - డాక్టర్స్ మాఫియాను అరికట్టాలి - బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజి డిమాండ్

మంచిర్యాల, డిసెంబర్ 20, ప్రభాతవార్త

సరైన వైద్యం అందించకుండా నిర్లక్ష్యం చేయడంతో ఓ నిండు ప్రాణం పోవడానికి కారణమైన డాక్టర్ ఎం. శ్రీలత హాస్పిటల్ లైసెన్స్ రద్దు చేయాలని, శ్రీలత నర్సింగ్ హోమ్‌ను సీజ్ చేయాలని, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జడ్పీటీసీల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కొయ్యల ఏమాజి డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి ఎం అండ్ హెచ్ ఓ అనితకు న్యాయవాది కొయ్యల ఏమాజి, ఎస్సీ,ఎస్టీ మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యులు దుర్గం ఎల్లయ్య లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. డాక్టర్ నిర్లక్ష్యం వల్లనే ప్రాణం పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మంచిర్యాలలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఉన్న శ్రీలత నర్సింగ్ హోమ్‌కు కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన కుమ్మరి పద్మ వసంతరావు దంపతులు డెలివరీ కోసం ఆసుపత్రికి 15వ తేదీన వచ్చారని, మధ్యాహ్నం ఒంటి గంటకు హాస్పిటల్‌లో పద్మను అడ్మిట్ చేశారు. కానీ 3 గంటల 46 నిమిషాలకు చెకప్ చేసి ఆపరేషన్ చేస్తానని చెప్పి రాత్రి తొమ్మిది గంటల వరకు కూడా ఆమెను పట్టించుకోలేదని, రాత్రి తొమ్మిది గంటలకు డాక్టర్ వచ్చి కడుపులో ఉన్న బిడ్డ పల్స్ అందడం లేదని, ప్రాణం హై రిస్క్‌లో ఉందని ఆపరేషన్ చేయకుండా ఆపేశారు. తర్వాత ఆపరేషన్ చేయడంతో అప్పటికే ఆలస్యమై కడుపులో బిడ్డ చనిపోయిందని ఏమాజి ఆవేదన వ్యక్తం చేశారు. బిడ్డ మృతికి కారణమైన డాక్టర్ శ్రీలత లైసెన్స్ రద్దు చేసి, నర్సింగ్ హోమ్ లైసెన్స్ రద్దు చేయాలని, బాధిత కుటుంబానికి 25 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని ఏమాజి డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్, డి ఎం అండ్ హెచ్ ఓకు ఫిర్యాదు చేయగా దేనిపై విచారణ కమిటీ వేస్తామని, వారి నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. బాధిత కుటుంబ సభ్యుల తరపున జిల్లా వినియోగదారుల ఫోరంలో కేసు వేస్తామని ఏమాజి తెలిపారు. జిల్లా కలెక్టర్‌ను కలిసిన వారిలో ఏమాజి, దుర్గం ఎల్లయ్య, దుర్గం రాజేశ్వర్, బాధితులు వసంతరావు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా పాలనాధికారికి వినతిపత్రం ఇస్తున్న బిజెపి నాయకులు

## సోమగూడెం (కే) లంబాడి తాండా (కే) గ్రామాలను కాపాడాలి

బెల్లంపల్లి, డిసెంబర్ 20, ప్రభాతవార్త

ఇటీవల వెలువడిన కేకే ఓసి ముంపు ప్రాంత 146 సర్వేలో 200 ఎకరాల నోటిఫికేషన్ గురించి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఇందులో భాగంగా ఇప్పటివరకు సాగు చేయని వారు, సింగరేణి, ఆర్టీసీ ఉద్యోగుల పేర్లు, ఊరికి, భూమికి సంబంధం లేని వాళ్ళ పేర్లతో వచ్చిన నోటిఫికేషన్ నిలిపి వేయాలని కోరడం జరిగింది. నిజమైన రైతుల పేర్లు కాకుండా బోగస్ పట్టాలు పొందిన వారి పేర్లు, సోమగూడెం మరియు లంబడితండ (కే)లో గ్రామ పంచాయతీలోని ఇండ్లడుగు స్థలాలను ముంపు ప్రాంత పేరుతో నకిలీ పత్రాలను, దళారులు తప్పుడు పత్రాలు సృష్టించి నోటిఫికేషన్ లో వచ్చేటట్టు చేసి పరిహారం పొందాలని చూస్తున్నారన్నారు. దలారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి సంకే రవి, బుగ్గ గూడెం సర్పంచ్ నవనందుల పుష్పలత, యువజన కాంగ్రెస్ కాసిపేట మండల అధ్యక్షుడు కనుకుల రాకేష్, సింగరేణి కార్మికుల సంఘం నాయకుడు భుక్యా ప్రవీణ్ నాయక్, యూత్ నాయకులు, వార్డ్ సభ్యుడు తొడేటి ప్రశాంత్, గ్రామస్తులు బూట్ల వెంకటలక్ష్మి, అజ్మీరా లక్ష్మి, ఇస్లావత్ మమత, నరేష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

## 29వ తేదీ నుంచి ప్రజావాణి యధాతధం

### - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, డిసెంబర్ 20, ప్రభాతవార్త

2వ సాధారణ పంచాయతీ ఎన్నికలు 2025లో గెలుపొందిన సర్పంచ్, వార్డు సభ్యులు ఈ నెల 22వ తేదీన ప్రమాణ స్వీకారం చేయనున్నందున అధికార యంత్రాంగం ఆయా పనులలో నిమగ్నమై ఉంటారని, ఈ కారణంగా ఈ నెల 22వ తేదీ సోమవారం రోజున జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం వాయిదా వేస్తూ ఈ నెల 29వ తేదీ నుండి యధాతథంగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, దరఖాస్తుదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

## రామకృష్ణాపూర్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామకృష్ణాపూర్, డిసెంబర్ 20, ప్రభాతవార్త

రామకృష్ణాపూర్ పట్టణంలోని సింగరేణి కార్మిక వాడల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, కార్మికులు సహకరించాలని అధికారులు కోరారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సబ్ స్టేషన్‌లలో మరమ్మత్తులు ఉన్న కారణంగా విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని తెలిపారు.

### చందమామకు బదులుగా సెల్‌ఫోన్ మామ

## పిల్లల సహజ జ్ఞానాన్ని అడ్డుకుంటున్నది

### - వెల్ బేబీ షోలో మందమర్రి జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ

మందమర్రి, డిసెంబర్ 20, ప్రభాతవార్త

చిన్నపిల్లలను తల్లి ఎత్తుకుని చందమామను చూపిస్తూ అన్నం తినిపించే రోజులు పోయి సెల్ ఫోన్ మామను చూపించి ఏడ్పు మాన్పించే రోజులు వచ్చాయని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ తెలిపారు.సింగరేణి ఆవిర్భావ వేడుకల్లో భాగంగా మందమర్రి ఏరియాలోని కేకే 1 డిస్పెన్సరీలో శనివారం ఉదయం వెల్ బేబీ షోను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్ ఫోన్లు పిల్లల సహజ జ్ఞాన తృష్ణను హరిస్తున్నాయన్నారు. ప్రకృతి పరిశీలన, పరిసరాల పరిచయాలు పసిపిల్లలకు మేలు చేస్తాయని అన్నారు. తల్లిదండ్రులు ఆ దిశగా ఆలోచన చేయాలన్నారు. సింగరేణి కార్మికుల పిల్లలంటే గతంలో చెడు అభిప్రాయం ఉండేదానివి కానీ నేడు దేశ విదేశాల్లో మంచి స్థానాల్లో కొనసాగుతున్నారన్నారు. గుర్తింపు సంఘం కార్యదర్శి సలంద్ర సత్యనారాయణ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. రామకృష్ణాపూర్ ఏరియా హాస్పిటల్ డి.వై.సీ.ఎమ్.ఓ డాక్టర్ మధు, కేకే 1డిస్పెన్సరీ మెడికల్ సూపరింటెండెంట్ కె. నాగేశ్వర్ రావులు పిల్లల పెంపకం లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. శారీరక ఎదుగుదల మాత్రమే కాకుండా మానసిక ఎదుగుదల కు తీసుకోవాల్సిన చర్యలకు గురించి పిల్లల వైద్యురాలు డాక్టర్ శైలజ వివరించారు.ఈ పోటీలో సుమారు 40 మంది పిల్లలు పాల్గొన్నారు. ఇందులో బహుమతి పొందిన వారికి ఈ నెల 23న జీఎమ్ కార్యాలయంలో జరిగే సింగరేణి ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలలో బహుమతులు ఇవ్వనున్నట్లు వారు తెలియజేశారు.వెల్ బేబీ షో పానెల్ డాక్టర్లు డాక్టర్ శైలజ (పీడియాట్రిషన్), డాక్టర్ శ్రీజలు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మందమర్రి సేవ అధ్యక్షురాలు శ్రీవాణి రాధాకృష్ణ, ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ సాలేంద్ర సత్యనారాయణ, డీజీఎమ్ (పర్సనల్) సిహెచ్. అశోక్, సీనియర్ పర్సనల్ అధికారి బొంగోని శంకర్‌లు పాల్గొన్నారు.



# మెస్సీపై ఉన్న శ్రద్ధ సింగరేణి ఆవిర్భావ వేడుకులపై లేదా?


## అధికారుల తీరు పట్ల సింగరేణి విశ్రాంత కార్మిక సంఘం ఆగ్రహం

**మంచిర్యాల, డిసెంబర్ 20, ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్రానికే తలమానికమైన సింగరేణి సంస్థ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ నెల 23న ఘనంగా అట్టహాసంగా కార్మికుల మనోభావాలకు అనుగుణంగా సింగరేణి ఆవిర్భావ వేడుకలు నిర్వహించాల్సిన సింగరేణి యాజమాన్యం ఆవిర్భావ వేడుకులకు ఈసారి సరిఅయినా విధంగా నిధులను కేటాయించకపోవడం, వేడుకలను జీఎంల కార్యాలయ ఆవరణలో నిర్వహించడాన్ని సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం తీవ్రంగా నిరసన వ్యక్తం చేశారు. ఫుట్‌బాల్ దిగ్గజం మెస్సీ పై ఉన్న శ్రద్ధ ఆవిర్భావ వేడుకల పై లేకపోవడం అధికారుల అనాలోచిత నిర్ణయం చాన బాధాకరం అని, హైదరాబాద్‌లో నిర్వహించిన ఫుట్ బాల్ ఆటకోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసిన సింగరేణి అధికారులు సింగరేణి ఆవిర్భావ వేడుకలకు నిధులను కోత పెట్టి వేడుకలను తుతు మంత్రంగా నిర్వహించడం 130 సంవత్సరాల సింగరేణి చరిత్రలో మాయని మచ్చగా మిగిలిపోతుందని శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో జరిగిన సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘ సమావేశం అధికారుల తీరు పట్ల తీవ్ర ఆవేదన వెలుబుచ్చారు. ప్రతి సంవత్సరం సింగరేణి యాజమాన్యం నిర్దేశించిన వార్షిక ఉత్పత్తి ఉత్పాతకలను అధికమించి సింగరేణి సంస్థ కు వేల కోట్ల లాభాలు తీసుకొస్తున్న సింగరేణి దేను అత్యతి వైభవంగా నిర్వహించాల్సిన అధికారులు నిధులకు కోత పెట్టి ఆవిర్భావ వేడుకల పట్ల కార్మికుల మనోభావాలను దెబ్బ తీయడమే అని అన్నారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ నెల 23న సింగరేణి వ్యాప్తంగా స్టేడియంలలో భూగర్భ గనులు, ఓసిపిల నమోనా, బ్లాస్టింగ్ గ్యాలరీ, రెస్క్యూ, పర్యావరం తదితర ప్రత్యేక స్టాల్స్‌లను ఏర్పాటు చేయాలని, మైదానాలను సుందరంగా తీర్చిదిద్దాలని సాంస్కృుతిక కార్యక్రమాలు కూడా పెద్ద ఎత్తున నిర్వహించలని సింగరేణి యాజమాన్యన్ని సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘ సమావేశం డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గౌరవ అధ్యక్షులు రాళ్లబండి రాజన్న, అధ్యక్షులు గజెల్లి వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి పూదరి నర్సయ్య, ఉపాధ్యక్షులు బూర్ల జ్ఞాని, ఏ గంగయ్య, నాయకులు అడిచర్ల రాజేశం, చారి, పర్వతాల యాదవ్, రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సింగరేణి విశ్రాంతి కార్మికుల సంఘం నాయకులు



## నిర్మల్ జిల్లా కలెక్టర్ అభినాష్ అభినవ్‌కు అభినందనలు తెలిపిన ఎంపిడిఓలు

**నిర్మల్ పట్టణం, డిసెంబర్ 20 ప్రభాతవార్త**

నిర్మల్ జిల్లాలో ఇటీవల ముగిసిన గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించినందుకు జిల్లా కలెక్టర్ అభినాష్ అభినవ్‌ను అన్ని మండలాల ఎంపీడీవోలు శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అభినందించారు. ఎంపీడీవోలు పుష్పగుచ్చాలను అందిస్తూ, శాలువులతో సన్మానించారు. అలాగే, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్‌ను కూడా ఎంపీడీవోలు శాలువాతో సన్మానించారు. మూడు దశల్లో నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికలు ఎక్కడా ఇబ్బందులు లేకుండా, ప్రశాంత వాతావరణంలో పూర్తయ్యాయని ఎంపీడీవోలు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో అధికారులకు కలెక్టర్ ఇచ్చిన ప్రోత్సాహం గొప్పదని, కలెక్టర్ మార్గదర్శకత్వంలో జిల్లాలో ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేశామని వారు అభిప్రాయపడ్డారు. అందరి సహకారంతో ఎన్నికలు విజయవంతంగా నిర్వహించడం జరిగిందని ఎంపీడీవోలను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో ఎంపిడిఓలు లక్ష్మీకాంత్, గజానన్, నీరజ్ కుమార్, రాధ, అరుణ, రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## గ్రామ పంచాయతీ అభివృద్ధి మీ బాధ్యత

### - కలెక్టర్ రాజర్షి షా

**నార్నూర్, డిసెంబర్ 20, ప్రభాతవార్త**

నార్నూర్ గ్రామ పంచాయతీ అభివృద్ధి బాధ్యతను సర్పంచులు సమర్థంగా నిర్వర్తించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. నార్నూర్ సర్పంచ్‌గా గెలుపొందిన సందర్భంగా సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ కార్యదర్శి గజానంద్ నాయక్ కలెక్టరు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. నార్నూర్ మండలం నీతి అయోగ్ కార్యక్రమానికి ఎంపిక కావడం గర్వకారణమని, అభివృద్ధికి జాతీయ, రాష్ట్ర స్థాయి పురస్కారాలు లభించాయని కలెక్టర్ గుర్తు చేశారు. భవిష్యత్తులో నార్నూర్ను ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దుతామని గజానంద్ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్, జేఏసీ మాజీ చైర్మన్ ఉత్తం రాథోడ్ పాల్గొన్నారు.

## పిడిఎస్‌యూ మహాసభల పోస్టర్‌ల ఆవిష్కరణ

**జైపూర్, డిసెంబర్ 20, ప్రభాతవార్త**

జనవరి 5, 6, 7 తేదీలలో వరంగల్‌లో జరిగే పి.డి.ఎస్.యూ తెలంగాణ రాష్ట్ర 23వ మహాసభల పోస్టర్‌లను శనివారం జైపూర్ మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పి.డి.ఎస్.యూ జిల్లా ఉపాధ్యక్షుడు పి.సికిందర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జూనియర్ కాలేజీలో మధ్యాహ్న భోజనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని అన్నారు. జైపూర్ జూనియర్ కాలేజీలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని అన్నారు. కళాశాల చుట్టూ ప్రహరీ గోడ లేనందున అసంఘిక కార్యక్రమాలు చోటు చేసుకోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలేజీలో క్రీడా స్థలం ఉండి క్రీడలకు అనుకూలంగ స్థలం ఉండకపోవడంతో విద్యార్థులు క్రిడలు ఆడుకోలేనటువంటి పరిస్థితి ఏర్పడి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్థానిక ఎమ్మెల్యే వెంటనే స్పందించి జూనియర్ కాలేజీలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యూ జిల్లా నాయకులు రామ్, ముకేశ్, రాంచరణ్ తేజ్, పూజ, వర్షిణి, సింధూజ, సాహిత్య కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



## నేడు మాలి సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం

**కాగజ్‌నగర్ రూరల్, డిసెంబర్ 20, ప్రభాతవార్త**



గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులుగా గెలుపొందిన మాలీ కులస్తులకు ఆదివారం సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు మాలీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెండుగురె శ్యామ్‌రావు శనివారం తెలిపారు. కాగజ్‌నగర్ పట్టణంలోని రిటైర్డ్ విశ్రాంత ఉద్యోగుల భవనంలో మధ్యాహ్నం 12.30 గంటలకు సన్మాన కార్యక్రమం ఉంటుందని మాలి సంక్షేమ రాష్ట్ర, జిల్లా కమిటీ, మండల, గ్రామ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, గెలుపొందిన సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు సభ్యులు అందరు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## ధర్మారం కోతిదేవుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే

**సారంగాపూర్, డిసెంబర్ 20, ప్రభాతవార్త:**

లక్ష్మణచందా మండలం ధర్మారం గ్రామంలో కోతిదేవుని ఆలయాన్ని బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, మండల అధ్యక్షులు చిన్నయ్య, మాజీ ఎంపీపీ అడ్వాల రమేష్, ముత్యం రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు సత్యం చంద్రకాంత్, జమాల్, నాయకులు శ్రీధర్ రెడ్డి, మల్లేష్, శంకర్, పీచర సర్పంచ్ రాజేశ్వర్, ఉపసర్పంచ్ వినీత్, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## యాప్ ద్వారానే యూరియా కొనుగోలు చేసుకోవాలి

### - మండల వ్యవసాయ శాఖ అధికారిని సుష్మా

**తాండూర్, డిసెంబర్ 20, ప్రభాతవార్త :**



తెలంగాణ ప్రభుత్వం రైతుల సౌలభ్యం కోసం యూరియా పంపిణీ కోసం ప్రత్యేక యాప్ ను ప్రవేశపెట్టిందని తాండూరు మండల వ్యవసాయ శాఖ అధికారిణి సుష్మా తెలిపారు. ప్లే స్టోర్ ద్వారా యాప్ డౌన్లోడ్ చేసుకొని లాగిన్ అవ్వాలన్నారు. డీలర్ వద్ద వేచి ఉండే సమయం తగ్గుతుందన్నారు. యాప్ లో పాస్ బుక్ నంబర్ లేదా ఆధార్ నంబర్ ఉపయోగించి రైతులు ఇంటి వద్ద నుంచే యాప్ లో వివరాలను నమోదు చేసి నచ్చిన డీలర్ వద్ద యూరియా కొనుగోలు చేసుకోవచ్చున్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

# అడెల్లి సర్పంచ్‌ను సన్మానించిన జేఏసీ నాయకులు

**సారంగాపూర్, డిసెంబర్ 20, ప్రభాతవార్త:**

మండలంలోని అడెల్లి గ్రామ సర్పంచ్ గా దండు సాయన్నను గ్రామ ప్రజలు గెలిపించడం జరిగింది. ఇక్కడ జనరల్ స్థానానికి కేటాయించగా అక్కడ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన దండు సాయన్న పోటీ చేసి గెలుపొందడం జరిగింది. అతనిని బీసీ ఎస్సీ ఎస్టీ జెఏసి జిల్లా అధ్యక్షుడు యాటకారి సాయన్న శాలువా కప్పి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపినారు. మనం ఈ విధంగా ఎన్నికలలో పోటీ చేసి మన సామాజిక వర్గాలను గెలిపించుకొని పరిపాలన పగ్గాలను చేపట్టాలని కోరినారు. ఈ కార్యక్రమంలో దండు సాయన్న మాట్లాడుతూ తను ప్రజలకు చేసిన సేవలు తనను గెలిపించిందని తెలిపినారు. మరిన్ని సేవా కార్యక్రమాలు చేసి, నా ప్రజల యొక్క రుణాన్ని తీర్చుకుంటానని తెలిపినారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ ముదిరాజ్, మహారాజు రవీందర్, శేఖర్ చారిరాజు తదితరులు పాల్గొన్నారు.



# సీహెచ్‌పీలో భద్రత కరువు..

# కార్మికుల ప్రాణాలకు రక్షణేది?

## - యాజమాన్య తీరుపై ఏఐటీయూసీ ఆగ్రహం

**నస్పూర్, డిసెంబర్ 20, ప్రభాతవార్త**

శ్రీరాంపూర్ సీహెచ్‌పీలో యాజమాన్యం భద్రతా ప్రమాణాలను విస్మరించి కార్మికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతోందని సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం (ఏఐటీయూసీ) నాయకులు ముష్కే సమ్మయ్య, బాజీ సైదా విమర్శించారు. శనివారం ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముష్కే సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్.కె. బాజీ సైదాల నేతృత్వంలోని నాయకుల బృందం సీహెచ్‌పీలోని పలు విభాగాలను సందర్శించి, కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల జరిగిన వేబ్రిడ్జి ప్రమాదం మరియు బెల్టు ప్రమాదాలను ప్రస్తావించారు. అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల ప్రమాదాలు జరుగుతుంటే, నిజాన్ని దాచి కార్మికులను సస్పెండ్ చేయడం దుర్మార్గమన్నారు. ఆర్మిక్స్ అనే కంపెనీకి చెందిన ఎలక్ట్రికల్ పరికరం పనిచేయకపోవడం వల్లే బెల్టు ప్రమాదం జరిగిందని, ఆ లోపాన్ని సరిదిద్దాల్సింది పోయి.. తమ తప్పును కప్పిపుచ్చుకోవడానికి నలుగురు కార్మికులను సస్పెండ్ చేయడం దుర్మార్గమని నాయకులు ధ్వజమెత్తారు. నేటికీ ఆ పరికరంలోని లోపాన్ని సరిచేయకుండా అలాగే కొనసాగించడం భవిష్యత్తులో మరిన్ని ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. సీహెచ్‌పీ ఇన్చార్జ్ అధికారి చంద్రలింగం, ఇంజనీర్ సదయ్యలు కార్మికులను మానసికంగా వేధిస్తున్నారని యూనియన్ నేతలు పేర్కొన్నారు. సమస్యలను విన్నవించిన కార్మికులను లక్ష్యంగా చేసుకుని ప్లేడేలలో కోతలు విధించడం, చిన్న చిన్న కారణాలకే చార్జిషీట్లు, సస్పెండ్లు ఇవ్వడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. సేఫ్టీ మీటింగ్‌లలో యూనియన్ ప్రతినిధులు ఇచ్చే సూచనలను సైతం ఖాతరు చేయడం లేదని, ఈ వైఖరి మార్చుకోకపోతే రాబోయే రోజుల్లో గుర్తింపు సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిట్ కార్యదర్శి తిరుపతితో పాటు నాయకులు సాయి రాజు, గునిగంటి నరసింహారావు, అశోక్ రెడ్డి, మావో, ఈశ్వర్, ఓదెలు, లచ్చయ్య, కల్లేపల్లి శ్రీనివాస్, అంకం శ్రీనివాస్, దొంగల శ్రీనివాస్, అశోక్, రవి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఏఐటీయూసీ నాయకులు



## బాలికల వసతిగృహాల్లో అన్ని మౌలిక వసతులు వెంటనే కల్పించాలి

**లక్షెట్టిపేట, డిసెంబర్ 20, ప్రభాతవార్త**

షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ బాలికల వసతి గృహము లక్షెటిపేటను శనివారం సాయంత్రం హాస్టల్‌ని సందర్శించి విద్యార్థులతో యుఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి మాట్లాడుతూ హాస్టళ్లలో విద్యార్థుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని మౌలిక వసతులు కల్పించాలి. నాణ్యమైన భోజనం, మెనూ ప్రకారం ఆహారం, చలికాలానికి వాటర్ హీటర్, శుభ్రమైన తాగునీరు, ఆరోగ్యకరమైన వాతావరణం తప్పనిసరిగా ఉండాలి. విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ విధానంగా అమలు చేయాలని కోరుతున్నాం. విద్యార్థినులకు ప్రతిరోజూ నాణ్యమైన భోజనం మెనూ ప్రకారం అందేలా పర్యవేక్షణ చేయాలి. హాస్టల్‌లో వాటర్ హీటర్‌లు వెంటనే ఏర్పాటు చేయాలి. శుభ్రమైన తాగునీరు, పరిశుభ్రమైన వంటగది, భోజనశాల తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, హాస్టల్ పరిసరాలు ఆరోగ్యకరమైన వాతావరణంతో ఉండేలా నిరంతర శుభ్రత నిర్వహించాలని, విద్యార్థినుల సమస్యలను తెలుసుకునేందుకు అధికారులు నిరంతర తనిఖీలు చేపట్టాలని పేర్కొన్నారు. సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల సంక్షేమాన్ని ప్రభుత్వ విధానంగా కచ్చితంగా అమలు చేయాలని అన్నారు.



బీమా స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తున్న బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి

## పీ.ఎం.ఎస్.బి.వై. పథకం

# పేదలకు వరం

### - బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు పులుగం తిరుపతి

**తాండూర్, డిసెంబర్ 20, ప్రభాతవార్త :**

కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సురక్ష భీమ యోజన (పి. ఎం. ఎస్. బి. వై) పథకం పేదలకు వరంలాంటిదని బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు పులుగం తిరుపతి అన్నారు..మండల కేంద్రంలో ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకం (పిఎంఎస్బివై) మెగా క్యాంప్ బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు పులుగం తిరుపతి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీమా చేయించుకున్న పేద కుటుంబాలకు ఆపద సమయంలో పథకం అండగా ఉంటుందన్నారు. బీమా చేయించుకున్న వారికి వెంటనే స్మార్ట్ కార్డును అందజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.కార్యక్రమంలో నాయకులు చిలువేరు శేషగిరి శ్రీకృష్ణదేవరాయలు పుట్ట కుమార్, డోంగ్రి ఆత్మరావ్, సిద్ధం మల్లేష్, ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

## యువతకు ఉచిత ఉపాధి శిక్షణ తరగతులు

**ఉట్నూర్, డిసెంబర్ 20, ప్రభాతవార్త :**

మండల కేంద్రంలోని కె బి కాంప్లెక్స్ లోని ఎస్‌బిఐఆర్ సెట్టి ద్వారా యువతకు వివిధ రకాల ఉపాధి పై ఉచితంగా శిక్షణ కల్పిస్తున్నట్లు శనివారం డైరెక్టర్ మొహమ్మద్ గౌస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23 నుండి జనవరి 22 వ తేదీ వరకు ఫోటో, వీడియో గ్రాఫిలకు శిక్షణలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18 నుండి 45 వయస్సుగల పురుషులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని ఆసక్తి, అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## విద్యావ్యవస్థలో ఉపాధ్యాయులే కీలకం

**సారంగాపూర్, డిసెంబర్ 20, ప్రభాతవార్త:**



విద్యావ్యవస్థను బలోపేతం చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదని జిల్లా విద్యాశాఖ అధికారి దర్శనం భోజన్న పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టి.ఆర్.టి.ఎఫ్) ఆధ్వర్యంలో శనివారం హైదరాబాదులో నిర్వహించిన విద్యా సదస్సు పోస్టర్స్‌ను నిర్మల్ సంఘ నాయకులతో కలిసి ఆవిష్కరించరు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్నటువంటి పాఠశాలలలో విద్యార్థులను మహోన్నతులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు క్రియాశీలక భూమిక పోషించాలని, అదేవిధంగా విద్యా సదస్సులలో విద్యావ్యవస్థను బలోపేతము చేసే అంశంపై సమర్థవంతంగా చర్చ జరగాలని ఆకాంక్షిస్తున్నామన్నరు. విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధి కేంద్రంగా అధికారులు, ఉపాధ్యాయులు కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శులు దర్శనం దేవేందర్, గడ్డం భూమన్న, పేట సంఘం ప్రధాన కార్యదర్శి డేవిడ్ బెన్వర్, తెలంగాణ పేట సంఘం జిల్లా అధ్యక్షులు సత్తయ్య, సుదార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన సర్పంచ్, ఉప సర్పంచ్‌లను సన్మానించిన ఎమ్మెల్యే

**బజార్ హత్నూర్, డిసెంబర్ 20, ప్రభాతవార:**

మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయితీ అయిన బజార్‌హత్నూర్ సర్పంచ్, ఉపసర్పంచ్‌గా ఎన్నికైన పరచ సాయన్న, కొంగర్ల శారద రాజన్నలను శుక్రవారం రాత్రి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వార్డు సభ్యులను కూడా శాలువాలతో సన్మానించారు. మండల కేంద్రానికి చెందిన దాదాపు 50 మంది వరకు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి యువకుల కృషి ఎంతో కీలకమని, మున్ముందు ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో కష్టపడి పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల యువజన సంఘం అధ్యక్షుడు డుబ్బుల చంద్రశేఖర్, చట్ల తరుణ్, చట్ల వినీల్, తాండ్ర శ్రీనివాస్, మండల యువకులు, తదితరులు పాల్గొన్నారు.





ఉట్నూర్‌లో చలి మంట వేసుకున్న స్థానికులు

## చలి గుప్పిట్లో ఉట్నూర్ ఏజెన్సీ ప్రాంతం

**ఉట్నూర్, డిసెంబర్ 20, ప్రభాతవార్త**

శీతల గాలుల ప్రభావంతో చలి తీవ్రత మరింత పెరిగింది. ఇప్పటికే మండలంలో ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదవుతున్న సంగతి తెలిసిందే. ఉట్నూర్ మండలం చలి గుప్పిట్లో చిక్కుకుంది. ప్రజలు చలి మంట ఉదయం 9 గంటల వరకు, సాయంత్రం 4 గంటలనుండి చలి మొదలు అవుతుంది. గతంలో ఎన్నడు లేనివిధంగా పక్షం రోజుల నుంచి ఉష్ణోగ్రతలే తక్కువ నమోదు కావడంతో ఏజెన్సీ ప్రాంత ప్రజలు రోజూ చలితో ఇబ్బందులు పడక తప్పడంలేదు.

## ప్రాథమిక పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ సందడి

**పెంచికల్ పేట్, డిసెంబర్ 20, ప్రభాత వార్త:**



పెంచికల్ పేట్ ప్రాథమిక పాఠశాలలో శనివారం రోజున ప్రధానోపాధ్యాయురాలు మూనా ఆధ్వర్యంలో పేరెంట్స్ మీటింగ్స్ తో పాటు ఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులు హాజరై పాఠశాల కార్యకలాపాల్లో భాగస్వాములు అయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రగతి, హాజరు, ప్రవర్తన, నైపుణ్యాభివృద్ధిపై ఉపాధ్యాయురాలు మూనా తల్లిదండ్రులకు వివరించారు. పిల్లల విద్యాభివృద్ధికి పాఠశాల, తల్లిదండ్రుల మధ్య సమన్వయం ఎంతో అవసరమని ఆమె తెలిపారు. పిల్లలకు నైతిక విలువలు క్రమశిక్షణతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాటు చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులు ఉపాధ్యాయులదేనని ఆమె పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులు తల్లిదండ్రుల సహకారంతో తయారుచేసిన పోషకాహార పదార్థాలను ప్రదర్శించగా పోషకాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ సుమిత్ర విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలి

**- పెండింగ్లో ఉన్న అన్ని రకాల బిల్లులు వెంటనే చెల్లించాలి, మెనూ చార్జీలు పెంచాలి - కోడిగుడ్లను, గ్యాస్‌ను ఉచితంగా సరఫరా చేయాలి**

**- సిఐటియు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్**

**మంచిర్యాల, డిసెంబర్ 20, ప్రభాతవార్త**

తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మిక యూనియన్ (సిఐటియు) మంచిర్యాల జిల్లా కమిటీ సమావేశం పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు దాసరి రాజేశ్వరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశం సందర్భంగా దుంపల రంజిత్ కుమార్ సిఐటియు జిల్లా కార్యదర్శి హాజరై మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. రోజు నిత్యాసర వస్తువుల ధరలు, కూరగాయల ధరలు పెరుగుతుంటే మెనూ చార్జీలు మాత్రం ప్రభుత్వాలు పెంచడం లేదన్నారు. మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు చెల్లించే బిల్లులలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ అంటూ బిల్లులు వేస్తున్నారని, అలాకాకుండా ఒకే విధంగా బిల్లులు చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న జీతాలు, కోడి గుడ్ల, మెనూ బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. అదే విధంగా కోడిగుడ్లను, గ్యాస్‌ను ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలని, ఐడి కార్డులు, యూనిఫామ్‌లు ఇవ్వాలన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎండి.రఫీయా మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి, రబియా,సరిత, మధునమ్మ, గడ్డం లక్ష్మి, వరలక్ష్మి, ఉమా జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు


అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయ శాఖ అధికారి వీరన్న

## యూరియా కొనుగోలు ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారానే..

**వేమనపల్లి, డిసెంబర్ 20, ప్రభాతవార్త**

యూరియా కొనుగోలు కేవలం ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారానే ఇవ్వబడుతుందని మండల వ్యవసాయ శాఖ అధికారి వీరన్న తెలిపారు. శనివారం రైతులకు, ఎరువుల వ్యాపారులకు యూరియా బుకింగ్ యాప్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ యాప్ ద్వారా ఎరువుల పంపిణీ పూర్తిగా పారదర్శకంగా జరుగుతుందని, అంతే కాకుండా అవసరం అయిన రైతుకే యూరియా అందుతుందని, దీంతో యూరియా కొరత ,అక్రమ నిల్వ, అక్రమ విక్రయాలకు అడ్డుకట్ట పడుతుందని, రైతుకు కూడా సకాలంలో యూరియా అందుబాటులో ఉంటుందని వివరించారు. రైతులు యూరియాను ముందుగా ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ నందు పట్టదారులు, పట్టలేని రైతులు, కౌలు రైతులు వారి మొబైల్, ఆధార్ నంబర్ ద్వారా బుక్ చేసుకొని డీలర్ వద్దకు వెళ్ళి తీసుకోవాలని ఆయన సూచించారు. అలాగే యూరియా అమ్మే ప్రతి డీలర్ ఈ యాప్ ద్వారా మాత్రమే అమ్మకాలు చేపట్టాలని ఆదేశించారు. ఈ యాప్ ఫోన్ లో ప్లే స్టోర్ నందు యాప్ వివరాలు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫెర్టిలైజర్ డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి హనుమాన్ బస్తీ సమస్యలు పరిష్కరించాలి

**బెల్లంపల్లి, డిసెంబర్ 20, ప్రభాతవార్త**



బెల్లంపల్లి మున్సిపాలిటీలోని 31వ వార్డు హనుమాన్ బస్తీలో వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని శనివారం బీఆర్ఎస్ పార్టీ వార్డు అధ్యక్షుడు బండారి ఓదెలు యాదవ్ మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు శనివారం కమిషనర్ తన్నీరు రమేష్‌ను కలిసి ఓదెలు యాదవ్ వినతి పత్రం అందజేశారు. వార్డులో నూతన రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజి నిర్మించేలా ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించాలని కమిషనర్‌ను కోరారు. అంతే కాకుండా వీధిదీపాలు చాలా చోట్ల వార్డులో వెలగటం లేదని దీంతో వీధులు అంధకారంలో ఉన్నాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు, అండర్ గ్రౌండ్ డ్రైనేజి నిర్మాణ పనులను నాటి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య శంకుస్థాపన చేయడం జరిగిందని కమిషనర్‌కు ఓదెలు గుర్తు చేశారు. ఈ సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని లేనట్లయితే వార్డు ప్రజలను సమీకరించి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఓదెలు హెచ్చరించారు.

## కారుణ్య నియామకాల్లో పారదర్శకతకు డిజిటల్ బాట!

**- సింగరేణిలో ప్రీహైరింగ్ అప్లికేషన్‌పై జీఎం జీవీ కిరణ్ కుమార్ సమీక్ష**

**నస్పూర్, డిసెంబర్ 20, ప్రభాతవార్త**

సింగరేణి సంస్థలో కారుణ్య మరియు ఆధారిత నియామక ప్రక్రియను మరింత వేగవంతం చేస్తూ, పూర్తి పారదర్శకతతో నిర్వహించేందుకు డిజిటల్ విధానాన్ని పటిష్టం చేస్తున్నట్లు జీఎం (పర్సనల్) వెల్ఫేర్ అండ్ సీఎస్ఆర్ జీవీ కిరణ్ కుమార్ తెలిపారు. శనివారం సింగరేణి ప్రధాన కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ ఏరియాల పర్సనల్ విభాగం అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీకోడ్ వై ఎంప్లాయ్ అనే ప్రీహైరింగ్ అప్లికేషన్ ద్వారా కారుణ్య నియామక కేసులను డిజిటలైజ్ చేసినట్లు వివరించారు. యూనిట్ స్థాయిలో దరఖాస్తులను స్వీకరించడం మొదలుకొని, శాప్ హెచ్ఆర్ బృందం ద్వారా తుది నియామక ఉత్తర్వులు ఇచ్చే వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. దీనివల్ల డేటా నమోదు, ధృవీకరణ, సీనియారిటీ జాబితా తయారీ, పోస్టింగ్ మరియు ఆన్‌బోర్డింగ్ వంటి అన్ని దశల్లో జాప్యం లేకుండా పారదర్శకత సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కొత్త డిజిటల్ విధానంలో మాజీ ఉద్యోగి వివరాల నమోదు, ధృవీకరణ, వైద్య పరీక్షలు (ఐఎంఈ), పుట్టిన తేదీ నిర్ధారణ వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తారని తెలిపారు. అనంతరం సీనియారిటీ జాబితాను రూపొందించి, పోస్టింగ్ వివరాలు మరియు జాయినింగ్ ఫార్మాలిటీస్ పూర్తి చేస్తారని వివరించారు. మానవ వనరుల విభాగం తుది సమీక్ష నిర్వహించిన తర్వాతే నియామక ప్రక్రియ పూర్తవుతుందని స్పష్టం చేశారు. ఈ విధానం ద్వారా డాక్యుమెంటేషన్ పక్కాగా ఉంటుందని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ మేనేజర్ (పర్సనల్) ఎస్. అనిల్ కుమార్, డిప్యూటీ పీఎం జీకే కిరణ్ కుమార్, అన్ని గనుల సంక్షేమ అధికారులు, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.




ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

## బెల్లంపల్లిలో బయోమెట్రిక్ టాయిలెట్ నిర్మాణ పనులు ప్రారంభం

**బెల్లంపల్లి, డిసెంబర్ 20, ప్రభాతవార్త**

బెల్లంపల్లి రూరల్ బస్టాండ్ వద్ద రూ.10 లక్షలతో బయోమెట్రిక్ టాయిలెట్ నిర్మాణ పనులు చేపట్టారు. బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ శనివారం నిర్మాణ పనులను ప్రారంభించారు. ఇక్కడ తొలుత ఇతర కట్టడాలు, ఆటో స్టాండ్ ఉండేది. ప్రజల సౌకర్యార్థం వాటిని తొలగించి బయోమెటిక్ టాయిలెట్‌ను నిర్మాణాన్ని చేపట్టారు. అభ్యంతరం చెప్పిన ఆటో డ్రైవర్ అసోసియేషన్ అధ్యక్షుడు కట్ట రామ్ కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిర్మాణ పనులను వ్యతిరేకిస్తూ ఆటో డ్రైవర్లు ఆందోళనకు దిగారు. అరెస్టు చేసిన ఆటోడ్రైవర్ సంఘం నేత కట్ట రాంకుమార్ ను విడుదల చేయాలని రోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. టాయిలెట్‌ను మరోచోట నిర్మించాలని, ఆందోళన చేపట్టారు. బెల్లంపల్లి సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆందోళన చేసి ప్రజలకు ఇబ్బంది కలిగించవద్దని, ఆటో స్టాండ్ విషయమై అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించుకోవాలని నచ్చచెప్పి ఆందోళన విరమింప చేశారు. ఆటో డ్రైవర్స్ అసోసియేషన్ నేతను విడుదల చేస్తామని హామీ ఇవ్వడంతో డ్రైవర్లు ఆందోళన విరమించారు.

## గ్రూప్ 3 కొలువు సాధించిన కుందారం ఆడబిడ్డ

**జైపూర్, డిసెంబర్ 20, ప్రభాతవార్త**



గ్రూప్ 3లో జైపూర్ మండలం కుందారం గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన ఆడ బిడ్డ రావుల శ్రీజ కొలువు సాధించి తల్లిదండ్రుల ఆశయాన్ని నెరవేర్చింది. గ్రూప్ 3 పరీక్షలో జూనియర్ అసిస్టెంట్ ఇన్ పబ్లిక్ లైబ్రరీస్ (హెచ్ఓడి) ఉద్యోగాన్ని సాధించడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేయగా, గ్రామ ప్రజలు అభినందించారు. ఇటీవల గ్రూప్ 2 పరీక్షకు సంబంధించి 1:3 లో రేషయోలో ధ్రువపత్రాల పరిశీలనలో పాల్గొన్ననప్పటికి ఉద్యోగం రాలేదు. తల్లిదండ్రుల కోరిక మేరకు ప్రభుత్వ ఉద్యోగం సాధించి, తన కాళ్ళ పై తను నిలబడి కుటుంబానికి తోడుగా ఉండాలనే సంకల్పంతో రాత్రి,బవళ్ళు కష్ట పడి చదివి నట్లు శ్రీజ తెలిపారు .తన తండ్రి బ్రతికి ఉన్నపుడు ఖిండిప్యూటీ తాసిల్దార్‌గ ఉద్యోగం సాధించి, గ్రామీణ పేదలకు సేవ చేయాలని చెప్పేవారని, రెవెన్యూ శాఖలో జాబ్ కొట్టడమే తన లక్ష్యంగా ముందుకు సాగుతానని స్పష్టం చేశారు. తండ్రి మరణించినప్పటికీ ఎలాంటి కోచింగ్ తీసుకోకుండా, కేవలం తన తల్లి పెన్షన్ డబ్బులతో జీవనం సాగిస్తూ ఇంటివద్దనే చదువుకుని, తన కూతురు ఉద్యోగం సాధించిందని తల్లి మల్లమ్మ సగర్వంగా తెలియజేశారు.

## ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు ప్రవీణ్ చేతులు మీదుగా విలేకరికి రాజ్యాంగ పుస్తకం

**మంచిర్యాల, డిసెంబర్ 20, ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్ కుమార్ భారత రాజ్యాంగం ఇంగ్లీష్ అనువాదం పత్రం జర్నలిస్ట్ అనిల్ భగత్‌కు బహుకరించారు. ఈ సందర్భంగా రేణికుంట్ల ప్రవీణ్ కుమార్ మాట్లాడుతు భగత్ సింగ్ యువజన సంఘం పేరిట అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ జర్నలిస్ట్‌గా ప్రయాణం సాగిస్తున్న అనిల్ సోదరసమనులు అని చిన్న వయసులో స్వచ్ఛంద సేవకుడిగా, రాష్ట్ర ఉత్తమ జర్నలిస్ట్‌గా, అనేక అవార్డుల అందుకోవడంతోపాటుగా కష్ట నష్టాలు చవిచూస్తున్నారు అని అన్నారు. పేదరికంలో మగ్గిపోతున్న ప్రజల సమస్యలే తన సమస్యగా భావిస్తూ ప్రజల కోసం పరితపించే అనిల్ భగత్ వార్తలకు ప్రజల నుండి అధికారులు ప్రజాప్రతినిధుల వరకు అనేకమంది అభిమానులు ఉన్నారు అని అన్నారు. ఆర్టికల్ 19 ప్రకారం ఫ్రీడమ్ ఆఫ్ స్పీచ్, ఫ్రీడమ్ ఆఫ్ ఎక్స్ ప్రెషన్ గురించి గళమెత్తె పత్రికా విలేకరులకు రాజ్యాంగం పట్ల సంపూర్ణ అవగాహన ఉండాలని ఆది వారికి వారి వృత్తికి మాత్రమే కాకుండా ఈ సమాజానికి ఎంతో మేలు చేస్తుందని అన్నారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు అనిల్ భగత్‌ను అభినందించారు.

